సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ౹ 4 ౹ అక్టోబర్ ౹ 2025


ఇల్లెందులో దసరా ఉత్సవాలకు హాజరైన ప్రజలు

న్యూస్‌రీల్

ముగిసిన శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

భక్తులతో కిటకిటలాడిన పెద్దమ్మతల్లి ఆలయం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన పెద్దమ్మతల్లి ఆలయంలో గత నెల 22న ప్రారంభమైన శ్రీ దేవీ శరన్నవరాత్రి వేడుకలు గురువారం ముగిశాయి. చివరి రోజున అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా దర్శనమచ్చారు. కాగా, దసరా సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారి సన్నిధిలో గురువారం సాయంత్రం శమీ పూజ నిర్వహించగా.. శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేశారు.

హస్తాల వీరన్నస్వామిని దర్శించుకున్న ఎస్పీ


వీరన్నస్వామి ఆలయంలో ఎస్పీ

చండ్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామ శివారులోని కనకగిరి అటవీ ప్రాంతంలో కొలువుదీరిన హస్తాల వీరన్నస్వామి వారిని ఎస్పీ రోహిత్ రాజ్ గురువారం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, దిశ కమిటీ సభ్యులు బొర్రా సురేష్ తదితరులు ఉన్నారు.

జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పూర్తి ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుచేయాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేయగా ఎట్టకేలకే ప్రభుత్వం స్పందించింది. రాష్ట్రానికి నాలుగు విద్యాలయాలు కేటాయించగా, అందులో ఒకటి జిల్లాకు దక్కింది. ఎంపీ చొరవ, ప్రత్యేక శ్రద్ధతో జిల్లాకు కేంద్రీయ విద్యాలయం మంజూరైందని కాంగ్రెస్ నాయకులు, జిల్లా ఆదివాసీ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ రఘురాంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కిన్నెరసానిలో దసరా సందడి

రెండురోజుల పాటు భారీ ఆదాయం


బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో దసరా పర్వదినాన పర్యాటకులు సందడి చేశారు. గురు, శుక్రవారాల్లో జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ సంఖ్యలో తరలి వచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. ఈ రెండు రోజుల్లో 1,795 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.1,07,515, 1,350 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.68,850 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపీ


రామసహాయం రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి వరుసగా రెండోసారి అవకాశం దక్కింది. డాక్టర్ నిషికాంత్ దూబే చైర్మన్‌గా ఉన్న కమిటీలో ఏడాది క్రితం సభ్యుడిగా ఆయన నియమితులు కాగా, రెండో దఫా కూడా అవకాశం కల్పించారు. లోక్‌సభ నుంచి 20మంది, రాజ్యసభ ఉంచి పది మంది సభ్యులతో ఏర్పడే ఈ కమిటీలో రెండోసారి అవకాశం దక్కడంపై ఎంపీ రఘురాంరెడ్డికి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతి నిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

నేత్రపర్వంగా విజయోత్సవం

భద్రాద్రి రామయ్య సన్నిధిలో ఘనంగా వేడుకలు

- దసరా మండపంలో శమీ, ఆయుధ పూజలు
- ముగిసిన శ్రీరామాయణ పారాయణోత్సవాలు
- 7న దమ్మక్క సేవా యాత్ర



రావణ దహనం (ఇన్‌సెట్) లీలా మహోత్సవంలో బాణం సంధిస్తున్న ఈఓ

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా రామదాసు నిర్మించిన దసరా మండపంలో అర్చకుల ప్రత్యేక పూజలు, భక్తుల శ్రీరామ నామ స్మరణల నడుమ వైభవంగా విజయోత్సవం నిర్వహించారు. సీతా లక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామికి రామదాసు చేయించిన ఆభరణాలు అలంకరించి మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణలతో పల్లకీ సేవగా దసరా మండపానికి తీసుకొచ్చారు. ఆ తర్వాత జమ్మిచెట్టు వద్ద అర్చకులు పుణ్యావాచనం, శమీ పూజ చేశారు. స్వామి వారి ఆయుధాలకు ప్రత్యేక పూజలు గావించారు. చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని, రావణాసురుడి చెర నుంచి ప్రజలను కాపాడిన రాముడి విజయమని అర్చకులు పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఈఓ దామోదర్ రావు చేతుల మీదుగా రావణాసుర వధ గావించే శ్రీరామ లీలా మహోత్సవ కార్యక్రమం జరిపారు. రావణాసురిడి ప్రతిమపై బాణం సంధించగా మిరుమిట్లు గొలిపే బాణసంచా కాంతులతో దసరా మండప ప్రాంగణం మెరిసిపోయింది. ఈ సమయంలో భక్తులు చేసిన శ్రీరామనామస్మరణలు, జయజయ ధ్వానాలతో దసరా మండప ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం చోటుచేసుకుంది. పూజల అనంతరం భక్తులు జమ్మి చెట్టు ఆకులను తలపై పెట్టుకుని, ఆ తర్వాత భద్రంగా దాచుకున్నారు.

రామాలయంలో భక్తుల రద్దీ..

దసరా సెలవులు ముగింపు దశకు రావడం, వారాంతపు సెలవులు కావడంతో రామాలయంలో భక్తుల రద్దీ నెలకొంది. గురు, శుక్రవారాల్లో జరిగిన నిత్యకల్యాణాలకు భారీగా హాజరయ్యారు. స్వామివారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, ఈనెల 7న శబరి స్మృతి యాత్ర నిర్వహించనున్నట్లు ఈఓ దామోదర్‌రావు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గిరి ప్రదక్షిణ, దమ్మక్క విగ్రహం వద్ద నివాళుల అనంతరం బేడా మండపంలో నిత్యకల్యాణం ఉంటుందని పేర్కొన్నారు. గిరిజన సంప్రదాయాల మేరకు వేడుక నిర్వహిస్తామని, బస్సుల ద్వారా వివిధ గ్రామాల నుంచి గిరిజనులను భద్రాచలం తరలించి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.


దసరా మండపంలో ఆయుధ పూజ చేస్తున్న అర్చకులు

ఇల్లెందులో ఘనంగా రావణవధ..


గుర్రాల రథంలో అమ్మవారు

ఇల్లెందు : పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం రాత్రి నిర్వహించిన రావణవధ కార్యక్రమం నేత్రపర్వంగా సాగింది. వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఇల్లెందులపాడు నుంచి వచ్చిన గుర్రాల రథం, దానిపై అమ్మవారు తరలివస్తున్న దృశ్యం హైలెట్‌గా మారింది. అయితే ఉత్సవాలు తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పిల్లాపాపలతో భారీ సంఖ్యలో హాజరైనా.. అందుకు తగ్గట్టుగా గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు కొంతమేర ఇబ్బంది పడ్డారు. వేదిక ఎత్తు తక్కువగా ఉండడంతో వెనుక ఉన్నవారికి వేడుకల దృశ్యాలు కనిపించకపోవడంతో పలువురు అసంతృప్తికి లోనయ్యారు. కనీసం ఎల్‌ఈడీ స్క్రీన్లయినా ఏర్పాటు చేస్తారనేకుంటే ఆశాభంగమే అయిందని నిట్టూర్చారు.

పత్తాలేని పాలపిట్ట..

సింగరేణి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో దసరా సందర్భంగా నిర్వహించిన జమ్మి(శమీ)పూజ వెలవెలబోయింది. విజయదశమి రోజున పాలపిట్టను చూడడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అయితే గతంలో పాలపిట్ట బొమ్మను గ్రౌండ్‌లో ఏర్పాటుచేసేవారు. కానీ ఈ సంవత్సరం ప్రత్యక్షంగా పాలపిట్ట దర్శనం కల్పిస్తామని నిర్వాహకులు విస్తృత ప్రచారం చేసినా.. చివరకు పాలపిట్ట కనిపించనే లేదు. దీంతో అందరూ నిరాశకు లోనయ్యారు. సినీ, టీవీ కళాకారుల మ్యూజికల్ నైట్, ఆట – పాటలు కూడా అలరించలేదు. తాగునీటి సౌకర్యం లేక పలువురు అల్లాడారు.

వేడుకలకు మంత్రి పొంగులేటి..


వేదికపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన దసరా ఉత్సవాలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హాజరయ్యారు. మొదలే ఆయన వచ్చి జ్యోతిప్రజ్వలన చేయగా.. ఆ సమయంలో వీక్షకులు లేక ఆవరణంతా ఖాళీగా కనిపించింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆయన ఇతర అంశాలు ఏమీ మాట్లాడకుండానే శుభాకాంక్షలు తెలిపి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ ఎం.కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావళీ, డీఈ మురళీకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామాయణ పారాయణోత్సవాలు

విజయదశమిని పురస్కరించుకుని రామాలయ ప్రాంగణంలోని చిత్రకూట మండపంలో నిర్వహిస్తున్న శ్రీరామాయణ పారాయణోత్సవాలు గురువారంతో ముగిశాయి. శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల ముగింపులో భాగంగా సూర్యప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామివారికి పట్టాభిషేక మహోత్సవాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సంక్షేప రామాయణ హవనం, మహా పూర్ణాహుతితో ముగింపు పలికారు.

గంగమ్మ చెంతకు దుర్గమ్మ


లాంచీ ద్వారా అమ్మవారి విగ్రహాలను తరలిస్తున్న దృశ్యం

- భద్రాచలం గోదావరిలో దుర్గామాత విగ్రహాల నిమజ్జనం
- నేడు, రేపు మరింతగా పెరిగే అవకాశం



భద్రాచలంఅర్బన్ : జిల్లాలోని పలు ప్రాంతాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలు నిమజ్జనానికి భద్రాచలం గోదావరి ఘాట్ వద్దకు చేరుకున్నాయి. ప్రతి ఏడాది వినాయకుడి విగ్రహాలు మాత్రమే గోదావరిలో నిమజ్జనానికి వస్తుంటాయి, అమ్మవారి విగ్రహాలు వచ్చినా చాలా తక్కువ సంఖ్యలోనే ఉండేవి. అయితే ఈ ఏడాది అనూహ్యంగా విజయదశమి పండుగ రోజు అర్ధరాత్రి తర్వాత నిమజ్జన ఘాట్ వద్దకు అధిక సంఖ్యలో విగ్రహాలు చేరుకున్నాయి. కాగా, ఇక్కడ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తుల్లో కొంతమేర ఆందోళన వ్యక్తమైంది. దీంతో అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఒక లాంచీతో పాటు క్రేన్ ఏర్పాటు చేశారు. కాగా, శని, ఆదివారాల్లో అమ్మవారి విగ్రహాలు నిమజ్జనానికి భారీగా వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 42 విగ్రహాలు నిమజ్జనం కాగా, మరో 30 విగ్రహాలు గోదావరి ఘాట్ వద్ద ఉన్నాయి.

నిమజ్జనం ఘాట్‌ను సందర్శించిన ఏఎస్పీ

భద్రాచలం గోదావరి నది ఘాట్ వద్ద అమ్మవారి విగ్రహాల నిమజ్జనాన్ని ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. నిమజ్జన సమయంలో ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసుల సూచనలను పాటించాలని, కార్యక్రమం ప్రశాంతంగా సాగేలా సహకరించాలని కోరారు. వీలైనంత త్వరగా విగ్రహాల నిమజ్జనం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ప్రతీ ఏడాది ఒక్కో దగ్గర చేస్తాం



మేం గత ఐదేళ్లుగా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విగ్రహాలు నిమజ్జనం చేయాలనుకున్నాం. గతేడాది బాసరలో నిమజ్జనం చేశాం. ఈ ఏడాది భద్రాచలంలో నిమజ్జనం చేయాలని 200 మందిమి వచ్చాం.

– బాలకృష్ణ, హైదరాబాద్


విద్యుత్ ఏఈపై బదిలీ వేటు

- డిప్యూటీ సీఎం సభలో విద్యుత్ అంతరాయమే కారణం?
- నేడు నిరసనకు ఉద్యోగుల నిర్ణయం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం విద్యుత్ సర్కిల్ పరిధి ముదిగొండ సెక్షన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ)గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను బదిలీ చేస్తూ ఎన్పీడీసీఎల్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయనను కారేపల్లి మండలం చీమలపాడు సెక్షన్ ఏఈగా బదిలీ చేసి, అక్కడి ఏఈ రామకృష్ణను ముదిగొండకు కేటాయించారు. అయితే, శ్రీనివాస్ బదిలీ వెనుక కారణాలపై విద్యుత్ శాఖలో చర్చ జరుగుతోంది. గతనెల 22న ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ముదిగొండలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరుకాగా గాలి దుమ్ము, వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు రెండు నిమిషాల అంతరాయం ఏర్పడింది. ఈ కారణంగానే ఏఈపై బదిలీ వేటు వేశారని తెలుస్తోంది. అయితే, వేటుపడిన శ్రీనివాస్ బీసీ ఉద్యోగుల సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేస్తుండగా.. ఆయన బదిలీని వ్యతిరేకిస్తూ సంఘం ఆధ్వర్యాన శనివారం నిరసన తెలపనున్నట్లు జిల్లా అధ్యక్షుడు సీహెచ్.నాగార్జున (ఏడీఈ) ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ బదిలీ అకారణమని, ఉద్యోగుల మనోస్థైర్యం, నిబద్ధతను దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. ఈ చర్యను వెనక్కి తీసుకోకపోతే ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యాన నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు.

ఫుల్‌జోష్‌గా దసరా..

జిల్లాలో రూ.42.50 కోట్ల మద్యం అమ్మకాలు



వైరా: ఒకే రోజు దసరా, గాంధీ జయంతి రావడంతో వైన్స్, బార్లు మూతపడ్డాయి. దీంతో వైన్స్ నిర్వాహకులు ముందస్తుగా సిద్ధం కావడం, మందుబాబులు కూడా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో అమ్మకంపై ఎలాంటి ప్రభావం పడలేదు. వైరా మద్యం డిపో నుండి సెప్టెంబర్ 29న (సోమవారం), 30న (మంగళవారం) ఉమ్మడి జిల్లాలోని వైన్స్, బార్లకు రూ.42.50 కోట్ల విలువైన మద్యం తీసుకెళ్లడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. సెప్టెంబర్ నెలంతా రూ.185 కోట్ల విలువైన మద్యం తీసుకెళ్లగా.. చివరి రెండు రోజుల్లో రూ.42కోట్లకు పైగా ఉండడం గమనార్హం.

ముందుగానే అమ్మకాలు

తెలంగాణలో అతిపెద్ద పండుగ అంటే దసరానే గుర్తుకొస్తుంది. బంధుమిత్రులతో కలిసి పండుగ జరుపుకునే పలువురి ఇళ్లలో మందు, విందు ఉంటుంది. కానీ ఈసారి దసరా రోజే గాంధీ జయంతి రావడంతో మందుబాబుల్లో ఆందోళన నెలకొనగా.. అమ్మకాలు ఎలా ఉంటాయోనని ఎక్సైజ్ అధికారులు ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యాన ఎక్సైజ్ సర్కిళ్ల వారీగా లక్ష్యాలు విధించి ముందుగా వైరా డిపో నుంచి మద్యం తీసుకెళ్లాలని సూచనలు చేసినట్లు సమాచారం. దీంతో సెప్టెంబర్ 29న రూ.20కోట్లు, 30వ తేదీన రూ 22.50 కోట్ల విలువైన మద్యాన్ని వైన్స్, బార్ల నిర్వాహకులు తరలించడంతో ఎక్సైజ్ శాఖకు గణనీయమైన ఆదాయం లభించింది. ఇక ఈనెల 1వ తేదీన మాత్రం రూ.కోటి విలువైన మద్యమే తీసుకెళ్లడం గమనార్హం. సాధారణంగా రోజుకు రూ.4కోట్ల నుండి రూ.6కోట్ల విలువైన మద్యం తీసుకెళ్తారు. కానీ 1వ తేదీన గణనీయంగా పడిపోవడానికి కారణాలు ఆరా తీసిన ఎక్సైజ్ అధికారులు అంతకు ముందు రోజు భారీగా సరుకు తీసుకెళ్లడం.. 2వ తేదీన షాప్‌ల బంద్‌తో అమ్మకాలు ఉండవని వ్యాపారులు వెనక్కి తగ్గినట్లు గుర్తించారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో 52బార్లు, మూడు క్లబ్‌లతో పాటుగా 210 వైన్స్‌కు వైరా డిపో నుంచి మద్యం తీసుకెళ్తారు.

కలెక్షన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆయిల్‌పామ్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర ప్రసాద్


కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రామచంద్ర ప్రసాద్

ములకలపల్లి : పామాయిల్ రైతుల సౌకర్యార్థం మండల పరిధిలోని జగన్నాథపురంలో ఏర్పాటు చేసిన టీజీ ఆయిల్‌ఫెడ్ కలెక్షన్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయిల్‌పామ్ రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్రప్రసాద్ అన్నారు. గురువారం ఆయన కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించి మాట్లాడారు. పామాయిల్ సాగు చేసే రైతులు పంటను పామాయిల్ ఫ్యాక్టరీ వరకు తీసుకెళ్లకుండా కలెక్షన్ పాయింట్‌లో కూడా విక్రయించవచ్చని తెలిపారు. ఫ్యాక్టరీలో చెల్లించే ధరకే ఇక్కడ కొనుగోలు చేస్తారని చెప్పారు. దీంతో రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు దిగుమతి కోసం నిరీక్షించాల్సిన అవసరం ఉండదని తెలిపారు. కార్యక్రమంలో దమ్మపేట ఏఎంసీ చైర్మన్ వాసం రాణి, మాజీ జెడ్పీటీసీలు బత్తుల అంజి, పైడి వెంకటేశ్వరరావు, నాయకులు తాండ్ర ప్రభాకర్ రావు, పర్వతనేని అమర్‌నాథ్, పువ్వాల మంగపతి, కరుటూరి కృష్ణ, కాసాని నాగప్రసాద్, కేవీ పాల్గొన్నారు.

రాష్ట్రంలో పాలన అధ్వానం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా


మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన మెచ్చా తదితరులు

దమ్మపేట/అశ్వారావుపేటరూరల్ : కాంగ్రెస్ హయాంలో పాలన అధ్వానంగా మారిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం ఆయన దమ్మపేట మండలం పార్కలగండి, అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామాల్లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాల్లో మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని, గెలుపే లక్ష్యంగా కష్టపడి పని చేయాలని సూచించారు. కేసీఆర్ సంక్షేమ పాలన కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ఆ పార్టీ పెద్దల అక్రమార్జన సొమ్మంతా ఢిల్లీ మీదుగా బీహార్‌కు చేరుతోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో తెలంగాణ బీసీలను ఏమార్చి, బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధిపొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఓట్ చోర్ అని తిరుగుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలుపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలానికి ఒక సమన్వయ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో జెడ్పీ చైర్మన్‌తో పాటు అత్యధిక జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని అన్నారు. అంతకుముందు పార్కలగండిలో పలువురు రేగా సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు రావు జోగేశ్వరరావు, దొడ్డా రమేష్, సున్నం నాగమణి, మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, నారం రాజశేఖర్, సోయం వీరభద్రం, దారా మల్లికార్జునరావు, యుగంధర్, రావుల శ్రీను, జలగం వాసు, పాకనాటి శ్రీను, యార్లగడ్డ శ్రీను, గాజుబోయిన ఏసు పాల్గొన్నారు.

ముఖ్య నాయకుల గైర్హాజరు..

ఆసుపాకలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, మాజీ జెడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి, నాయకులు యూఎస్ ప్రకాశరావు, సంకా ప్రసాద్, కాసాని చంద్రశేఖర్‌తోపాటు మరికొందరు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే, సమావేశ వేదిక మార్పుతో పాటు పార్టీ మండల అధ్యక్షుడి ఎన్నిక వ్యవహారమే దీనికి కారణమని కార్యకర్తలు చెబుతున్నారు.

క్లుప్తంగా

నూతన జీఎం కార్యాలయం ప్రారంభం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో రూ.2.5 కోట్లతో నిర్మించిన జీఎం నూతన కార్యాలయాన్ని డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. తొలుత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు, కార్మికులు, గాంధీజీ బాటలో నడవాలని సూచించారు. ఏరియా జీఎం శాలెంరాజు, ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి, యూనియన్ నాయకులు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌లో కానరాని గాంధీ జయంతి వేడుకలు

ఈ నెల 2న సింగరేణి కార్పొరేట్ ఏరియాలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించలేదు. దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించే వేడుకలను సింగరేణి సంస్థ విస్మరించడం సరికాదని కార్మికులు పేర్కొంటున్నారు. గాంధీ జయంతి రోజున వేతనంతో కూడిన సెలవును పొందటమే కాకుండా మరికొందరు అధికారులు ప్లేడేలు చేసి మూడు మస్టర్లు పొందుతున్నారని, కానీ గాంధీజీకి నివాళులర్పించకపోవడం శోచనీయమని పేర్కొంటున్నారు.

మధిర కళాకారులకు బహుమతులు



బహుమతి అందుకుంటున్న సుబ్బరాజు

మధిర: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలిలో నిర్వహించిన జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో మధిర కళాకారులు ఉత్తమ ప్రదర్శనతో అవార్డులు సాధించారు. గతనెల 27నుంచి ఈ నెల 2వరకు జరిగిన పద్య నాటక పోటీల్లో మధిర కళాకారులు ప్రదర్శించిన కస్తూరి తిలకం తృతీయ బహుమతి సాధించింది. అలాగే, డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజుకు ఉత్తమ దర్శకుడు, చింతామణి పాత్ర ధరించిన విజయరాణికి ప్రత్యేక జ్యూరీ బహుమతులు లభించాయి. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బరాజు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవతో సాంస్కృతిక కళా కేంద్రం ఏర్పాటుకాగా, అక్కడ సాధన చేసే అవకాశం దక్కిందని.. తద్వారా బహుమతులు సాధిస్తున్నామని తెలిపారు. అలాగే, చిలువేరు శాంతయ్య, ఇనపనూరి వసంత్, కిషోర్ రెడ్డి, నరాల సాంబశివారెడ్డి, ఎర్రగుంట రాజేశ్వరరావు, రామవరపు ప్రసాద్ తదితరులు కూడా భట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-15 బాలబాలికల చెస్ జట్లను శనివారం ఎంపిక చేయనున్నట్లు చెస్ అసోసియేషన్ బాధ్యులు సీహెచ్.గోపీకృష్ణ, జ్యోత్స్న తెలిపారు. ఆసక్తి ఉన్న వారు క్రీడాకారులు 94401 62749, 83091 34971 నంబర్లలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలకు హాజరయ్యే సమయాన వయసు ధ్రువీకరణ పత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు.

ఇసుక లారీ సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా ఏపీ నుంచి తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ లారీని దమ్మపేట పోలీసులు గురువారం సీజ్ చేశారు. మండలంలోని మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు వాహన తనిఖీ నిర్వహిస్తుండగా అనుమతులు లేకుండా ఏపీ నుంచి ఇసుకతో వచ్చిన లారీని పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ

ములకలపల్లి: కిరాణా దుకాణంలో చోరీపై గురువారం కేసు నమోదైంది. రాజుపేట గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాజేష్ ఇంటి సమీపంలోని కిరాణా దుకాణానికి బుధవారం రాత్రి తాళం వేసి ఇంట్లోకి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి, రూ.60 వేలు చోరీ చేసినట్లు గుర్తించాడు. మాస్క్ వేసుకున్న యువకుడు చోరీకి పాల్పడినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుప్రసాద్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

చండ్రుగొండ: మండలంలోని అన్నారంతండాకు చెందిన విద్యార్థి పునరావృత్తం శ్రీధర్ (15) అదృశ్యంపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. శ్రీధర్ గుండాలలోని గురుకుల కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. వినాయక చవితి పండుగకు ఇంటికి వచ్చాడు. అనంతరం కాలేజీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్న కుమారుడిని తండ్రి హతీరాం మందలించాడు. దీంతో ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు,స్నేహితులను వాకబు చేసిన ఆచూకీ లభించలేదు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107

వన్యప్రాణం తీయకండి!

- రక్షణ చట్టాలున్నా ఆగని అటవీ జంతువుల వధ
- జిల్లాలో పలుచోట్ల కేసులు, నిందితుల అరెస్ట్
- 10 తేదీ వరకు వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు

నేడు ప్రపంచ జంతు దినోత్సవం





అభయారణ్యంలోని గ్రామాల్లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఫారెస్ట్ అధికారులు

పాల్వంచరూరల్: జంతు సంరక్షణకు చట్టాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినా, అటవీశాఖ సిబ్బంది గస్తీ తిరుగుతున్నా, ట్రాప్ కెమెరాలు అమర్చినా జంతువులకు వేటగాళ్ల నుంచి రక్షణ కరువైంది. జిల్లాలోని కిన్నెరసాని అభయారణ్యంలో చుక్కల దుప్పులు, నెమళ్లు, కుందేళ్లు, కొండ గొర్రెలు, కణుజు, చిరుత పులులు, సాంబర్లు, ఎలుగుబంట్లు, అడవి దున్న వంటి వన్యప్రాణులు జీవిస్తున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం 1977 జనవరి 24న కిన్నెరసానిని అభయారణ్యంగా ప్రకటించారు. కానీ పలుమార్లు జంతవధ జరుగుతూనే ఉంది. జరిమానా, జైలు శిక్ష విధిస్తున్నా వన్యప్రాణులకు రక్షణలేకుండా పోయింది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకు వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ఫారెస్ట్ డివిజన్ల ఆధ్వర్యంలో కూడా వారోత్సవాలు చేపడుతున్నారు. ప్రభుత్వ సెలవు దినాలు కాకుండా ఏడు రోజులపాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నేడు ప్రపంచ జంతు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

వన్యప్రాణులను హతమార్చిన ఘటనలు కొన్ని..

- వన్యప్రాణులు వేటాగాళ్ల వేటుకు బలవుతూనే ఉన్నాయి. అటవీ ప్రాంతంలో విద్యుత్ ఉచ్చులు వేసి వధిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 17న దమ్మపేట రేంజ్‌లో దుప్పిని వేటాడి చంపి మాంసాన్ని వండుతుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు.
- గతంలో కిన్నెరసాని డీర్ పార్కు సమీపంలోనే దుప్పిని కుక్కలతో వేటాడారు. పాల్వంచ మండలం సోములగూడెం రోడ్డులోని అటవీ ప్రాంతంలో దుప్పిని వధించి మాంసం విక్రయించారు. అటవీశాఖాధికారులు ఇద్దరు నిందితులను పట్టుకుని కేసు నమోదు చేశారు.
- దంతెలబోరు అటవీప్రాంతంలో అడవి పందిని చంపి మాంసాన్ని విక్రయించగా, అధికారులు పట్టుకున్నారు. ఏడుళ్లబయ్యారం అటవీప్రాంతంలో దుప్పిని బాణాలతో వేటాడి సంహరించారు. ములకలపల్లి, చండ్రుగొండ అటవీ ప్రాంతాల్లో కూడా వన్యప్రాణులను వధించిన సంఘటనలు ఉన్నాయి. ఇల్లెందు డివిజన్‌లో విద్యుత్ ఉచ్చులతో అడవి దున్నలను వధించారు.
- రెండున్నరేళ్ల క్రితం ఉల్వనూరు వద్ద ఎలుగుబంటిని వధించగా, ఐదుగురిపై కేసుమోదు చేశారు. రెండేళ్ల క్రితం అలుగును చంపి వాటి పెంకులను ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేశారు. ఇలా ఏటా జిల్లా అటవీప్రాంతంలో వేటగాళ్లు వన్యప్రాణుల ఉసురు తీస్తున్నారు.

జంతువులను వధిస్తే ఏడేళ్ల వరకు జైలు

- జంతువులను వధిస్తే 3 నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష, రూ. 25 వేల నుంచి రూ. లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. వన్యమృగాల సంరక్షణ చట్టం 1972 ప్రకారం పులి, చిరుత, నెమలి, ఎలుగుబంటి, కుందేలు, పక్షులు, మొసళ్లు, అడవి దున్న, దుప్పి తదితర జంతువులను వధించడం నేరం.
- పులిని చంపినా, చర్మం, గోళ్లు తీసినా, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించినా సెక్షన్ 51(ఎ) కింద 3 నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ. 25 వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఏడాదిపాటు బెయిల్ కూడా లభించదు. చిరుతపులిని వధించినా ఇవే శిక్షలు విధిస్తారు.
- ఎలుగుబంటి చంపినా, పట్టుకున్నా, సర్కస్‌లో ఆడించినా 3 నెలల నుంచి ఏడాది వరకు జైలు శిక్ష, రూ. 20వేల నుంచి రూ. లక్ష వరకు జరిమానా విధిస్తారు. వేటాడినట్లు రుజువైతే సెక్షన్ 37(ఏ)కింద 3 నుంచి 7 ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు.
- కోతులను పట్టుకున్నా, చంపిన, ఇంట్లో పెంచుకున్నా, అది నివాసం ఉండే ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించినా 5 నుంచి7 నెలలపాటు జైలు శిక్ష, రూ.20 వేల వరకు జరిమాన విధించే అవకాశం ఉంది.
- కుందేళ్లను చంపినా, పట్టుకున్నా, ఇంట్లో పెంచుకున్నా మూడేళ్ల జైలుశిక్ష, రూ. లక్ష వరకు జరిమానా విధిస్తారు.
- నెమళ్లను పట్టుకున్నా, వధించినా, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించినా, వాటి గుడ్లను పగులగొట్టిన, హాని చేసినా, వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 25 నుంచి రూ. లక్ష వరకు జరిమాన విధించే అవకాశం ఉంది.
- పశువులను చంపినా, నిర్బంధించినా, సంతానం కలగకుండా చేసినా, తాళ్లు, గొలుసులతో బంధించి వాహనాల ద్వారా తరలించినా రూ. 25వేలకు పైగా జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా విధిస్తారు.

10 వరకు సంరక్షణ వారోత్సవాలు



అటవీ జంతువుల సంరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. ఈ నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అటవీ గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు వంటివి చేపడుతున్నాం. తొలిరోజు నాకా బందీ నిర్వహించాం. రాత్రి, పగలు వాహనాలను తనిఖీలు చేపట్టాం. -బి.బాబు, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ

పండుగ పూట విషాదం

- నిమజ్జనానికి వెళ్తూ ట్రాక్టర్ బోల్తా
- ఒకరు మృతి, నలుగురికి గాయాలు

బూర్గంపాడు: బతుకమ్మ నిమజ్జనానికి వెళ్తున్న ట్రాక్టర్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందగా, నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. గురువారం తెల్లవారు జామున భద్రాచలం గోదావరి బ్రిడ్జిపై ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బూర్గంపాడులోని అంబేద్కర్ కాలనీకి చెందిన మహిళలు, భక్తులు బుధవారం రాత్రి వరకు బతుకమ్మలాడి అర్ధరాత్రి సమయంలో ఊరేగింపుగా నిమజ్జనానికి బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున గోదావరి కొత్త బ్రిడ్జిపై గుర్తు తెలియని వాహనం ట్రక్కును ఢీకొట్టింది. దీంతో ట్రక్కు బోల్తాపడింది. ఈ ఘటనలో ట్రక్కులో కూర్చున్న భక్తులు, మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. బూర్గంపాడు అంబేద్కర్ కాలనీకి చెందిన తోకల వెంకటరమణ(58) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ మేడ ప్రసాద్ ఘటనాప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ లత, లీలావతి, సుజాత, రాజేశ్‌లను చికిత్స నిమ్మితం 108వాహనంలో భద్రాచలం తరలించారు. మృతుడు వెంకటరమణ తాపీ పనులు చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుని కుమార్తె స్వర్ణలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డ్యాన్స్ చేస్తూ.. అస్వస్థతకు గురై

గుండెపోటుతో యువకుడి మృతి



రమేష్ మృతదేహం

బూర్గంపాడు: బతుకమ్మ నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. లక్ష్మీపురం గ్రామంలో బతుకమ్మ నిమజ్జనానికి వెళ్తున్న క్రమంలో డ్యాన్స్ చేస్తూ అస్వస్థతకు గురైన యువకుడు మృతిచెందిన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు గుండి రమేష్(30)బతుకమ్మ నిమజ్జనంలో డీజే పాటలకు డాన్స్ చేస్తూ అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన మిగతావారు ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. రమేష్ గుండెపోటుతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. డీజే సౌండ్స్‌తోనే రమేష్ గుండెపోటుకు గురైనట్లు స్థానికంగా చర్చించుకుంటున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది.

7న అండర్-19 క్రీడా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 బాలబాలికల ఆర్చరీ, రెజ్లింగ్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సంఘం కార్యదర్శి ఎం.డీ.మూసా కలీం తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 10 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. అలాగే, ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-19 ఖో-ఖో బాలబాలికల జట్ల ఎంపిక కల్లూరు మినీ స్టేడియంలో 11వ తేదీన జరుగుతుందని మూసా కలీం తెలిపారు.

అమ్మవారికి రూ.2.50లక్షల ఆభరణాలు



దాతలను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైరా: వైరా హనుమాన్‌బజార్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి అలంకరణ కోసం డాక్టర్ ఓర్సు వెంకటేశ్వర్లు - తైవశ్రీ దంపతులు రూ 2.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ వేముల శివకృష్ణ సత్కరించారు. అర్చకుడు రాజశేఖర్‌తో పాటు రాము, బాలయ్య, ఆంజనేయులు, ఏడుకొండలు పాల్గొన్నారు.

బాలింత ఆత్మహత్య

ములకలపల్లి: క్షణికావేశానికి గురై పురుగుల మందు తాగిన ఆరు నెలల బాలింత మృతి చెందింది. ఎస్సై ఎస్.మధుప్రసాద్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని పాతగంగారం గ్రామానికి చెందిన శివాని (21)కి, రాచన్నగూడెం గ్రామానికి చెందిన మడివి జగపతితో వివాహం జరిగింది. వీరికి ఆరు నెలల కుమారుడు ఉన్నాడు. బుధవారం రాత్రి భర్త బతుకమ్మ ఆట నుంచి ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. దీంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన శివాని పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి, అక్కటి నుంచి వరంగల్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందింది. మృతురాలు తండ్రి దుబ్బా చిన్నబ్బులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దమ్మపేట: భవనంపై నుంచి కిందపడి చికిత్స పొందుతున్న వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... ఏపీలోని గుడివాడకు చెందిన రాయనిపాటి కళ్యాణ శేఖర్(42)కు దమ్మపేట గ్రామానికి చెందిన జయలక్ష్మితో వివాహం జరిగింది. దంపతులు ఏడేళ్లగా తమ ఇద్దరు కుమారులతో కలిసి దమ్మపేటలోని గాయత్రి నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. జయలక్ష్మి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుండగా, శేఖర్ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో దసరా పండుగ రోజు గురువారం రాత్రి దమ్మపేటలోని గాయత్రి నగర్‌లో అద్దెకు ఉంటున్న భవనం తి మూడో అంతస్తు నుంచి కళ్యాణ్ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలు కాగా సత్తుపల్లి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



జోగ వినోద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని మొండితోగు గ్రామ శివారులో గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మొండితోగు గ్రామానికి చెందిన జోగ వినోద్(25) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వినోద్ ఇల్లెందులో దసరా ఉత్సవాలను వీక్షించి బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలానికి చెందిన ఏక విష్ణు మరో బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లెందు-గుండాల రహదారిపై మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నా యి. దీంతో ఇద్దరికి త్రీవ గాయాలు కాగా, స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వినోద్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏక విష్ణు చికిత్స పొందుతున్నాడు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని ఆదర్శనగర్‌లోని పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేసి తొమ్మిది మంది యువకులను అరెస్ట్ చేశారు. ఆరు సెల్‌ఫోన్లు, మోటార్‌సైకిల్, రూ.8,030 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయినవారిలో ఐతనబోయిన గోపి, కుంట నాగరాజు, కుంట నవీన్, మామిళ్ల రవి, అక్కినపల్లి చంటి, దేపాక నరేశ్, ఉప్పు శ్రీను, బాడిష శ్రీను, రేపాకుల వెంకన్న ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు మణుగూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు తెలిపారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న బూర్గుల వెంకటేశ్వర్లు

మణుగూరు రూరల్: ఎన్నికలకు సంబంధించిన రాజ్యాంగ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 233 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్సీలకు కేవలం ఐదు, ఒకే జెడ్పీటీసీ స్థానం కేటాయించడం దారుణమని అన్నారు. మణుగూరు మండలంలో రొటేషన్ ప్రకారం ఈ దఫా జెడ్పీటీసీ స్థానం ఎస్సీలకు ఇవ్వాల్సి ఉండగా, మళ్లీ ఎస్టీలకే కేటాయించారని ఆరోపించారు. కలెక్టర్ పరిశీలన చేసి జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలు కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మద్దెల భద్రయ్య, వేర్పుల నరేష్, వేర్పుల సురేష్, బూర్గుల సతీష్, బూర్గుల సంజీవరావు, ముల్క నరేష్, ఏసురత్నం, వేమూరి రవి, ఉల్లోజు బాబీ, బూర్గులవెంకటరత్నం, వేర్పుల శంకర్, దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో దందా!

అక్రమంగా తరలిపోతున్న సీతారామ ప్రాజెక్ట్ మట్టి



కాలువ సమీపం నుంచి మట్టి తోలిన దృశ్యం

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ శివారులో మట్టి దందా ఆగడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో అక్రమార్కులకు మట్టిని తరలించుకుపోతున్నారు. కొద్దిరోజులుగా స్తబ్దుగా ఉన్న మాఫియా దసరా సందర్భంగా ప్రభుత్వ సెలవులు రావడంతో రాత్రి వేళల్లో లారీల్లో కొద్దీ దర్జాగా తరలించారు. మండలంలోని పూసుగూడెం-మాధారం అటవీ ప్రాంతంలో సీతారామ ప్రధాన కాలువ సమీపం నుంచి భారీగా మట్టి తరలిస్తున్నారు. మీడియాలో పలుమార్లు కథనాలు రావడంతో ఇటీవల తోలకాలు నిలిపేశారు. పండుగ సెలవుల్లో మళ్లీ అక్రమంగా తరలించారు. గతంలో తరలించిన చోటుతోపాటు సమీపంలోని కిలోమీటరు దూరంలో మరో చోట మట్టి తోలకాలు చేపట్టారు. పూసుగూడెం పంప్‌హౌస్‌కు వెళ్లే సీతారామ కాలువ సమీపంలో, కాలువ తవ్విన మట్టి గుట్టలా పోయగా, రోజురోజుకూ అది మాయమవుతోంది. జేసీబీతో లారీల్లో లోడ్ చేసి సమీప పట్టణాలకు తరలించి, అక్రమంగా విక్రయిస్తున్నట్లు తెలిసింది.

తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడిగా వీరన్న



సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ జాగృతి జిల్లా నూతన అధ్యక్షుడిగా డి.వీరన్నను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరన్న మాట్లాడారు. జిల్లా నూతన అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినందుకు కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధిలో వెనుకబడే ఉందన్నారు. ఆంధ్రాలో విలీనం చేసిన గ్రామాలను పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేవరకు పోరాటాలను ఉధృతం చేస్తామని అన్నారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరారు. భద్రాద్రి రామయ్య భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. త్వరలో పూర్తిస్థాయి జిల్లా కమిటీని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ జాగృతి ఆటో విభాగం జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాళోత్ రాజేందర్ నాయక్, విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు సురేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సునీత, ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆదినారాయణ, సుగుణ, విజయ, ప్రవీణ్, సత్యవతి, ఆటో యూనియన్ నాయకులు ముజాహిద్, దేశి ప్రసాద్, రాంబాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పనిస్థలాలను పరిశుభ్రంగా ఉంచాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతీ ఉద్యోగి పనిస్థలం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్పెషల్ క్యాంపెయిన్ 5.0 నోడల్ ఆఫీసర్, జీఎం ఎం.శ్రీహరి అన్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో ఈ నెల 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకు స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం మాట్లాడుతూ పరిశుభ్రత, స్థలసృష్టి, సుందరీకరణ, వ్యర్థాల నిర్వహణ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏసీఎంఓ ఎం.ఉష, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ ఎస్వీ రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం వైస్ ప్రెసిడెంట్ పీతాంబర రావు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ కాల్వలో విద్యార్థి గల్లంతు

ఏన్కూరు: దసరా సెలవులకు బంధువుల ఇంటికి వచ్చిన విద్యార్థి ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి గల్లంతయ్యాడు. భద్రాద్రి జిల్లా సుజాతనగర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ దసరా సెలవుల సందర్భంగా ఏన్కూరు మండలం రాజలింగాలలోని బంధువుల ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం తన మేనమామ కొడుకుతో కలిసి ద్విచక్ర వాహనంపై సాగర్ కాల్వ వద్దకు వెళ్లాడు. అక్కడ హర్షవర్ధన్ బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి కాల్వలో పడడంతో గల్లంతయ్యాడు. బంధువులు, గ్రామస్తులు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఎస్సై సంధ్య ఆధ్వర్యాన పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

మహిళ ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన షేక్ సైదాబీ(35) గురువారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె ఓ పరుపుల ఫ్యాక్టరీలో, భర్త కిషోర్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉండగా, సైదాబీ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి వలస కూలీ దుర్మరణం

తల్లాడ: పొట్టకూటి కోసం మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చిన వ్యవసాయ కూలీ చేపలు పట్టేందుకు వెళ్లి నీట మునిగి మృతి చెందాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం బాలాఘాట్ జిల్లా రుక్మా గ్రామానికి చెందిన బ్రజిలాల్ (35) రెండు నెలల క్రితం మల్లవరం గ్రామంలో చెందిన రైతు ఐనాల రామలింగేశ్వరరావు వద్ద వ్యవసాయ పనుల కోసం పలువురితో కలిసి వచ్చాడు. ఈక్రమాన మల్లవరం సమీపంలోని వైరా రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు సెప్టెంబర్ 30వ తేదీ రాత్రి నలుగురు కూలీలు వెళ్లారు. వీరిలో ముగ్గురు తిరిగి వచ్చినా బ్రజిలాల్ రాకపోగా, వైరా రిజర్వాయర్ లో గాలిస్తుండగా గురువారం మృతదేహం బయటపడింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు తల్లాడ ఎస్ఐ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు.

వాహన పూజకు 'నకిలీ' టికెట్లు?

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ప్రైవేటు వ్యక్తుల దందా



సంతకాలు, తేదీలు లేకుండా, సీరియల్ నంబర్ తేడా ఉన్న రశీదులు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద వాహన పూజకు నకిలీ టికెట్లు విక్రయించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పటిలాగే దసరా పర్వదినం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి నుంచి ఆలయానికి వేలాది వాహనాలు పూజ కోసం వచ్చాయి. వాహన పూజతో ఎండోమెంట్‌కు రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. ఇందుకోసం వాహనదారులు టికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈసారి వాహన పూజ టికెట్ల విక్రయాలపై ఈఓ పర్యవేక్షణ కొరవడటంతో నకిలీ టికెట్లు వచ్చినట్లు వాహనదారులు ఆరోపించారు. టికెట్లపై ఈఓ, సంబంధిత క్లర్క్ సంతకాలు లేవు. రశీదుపై ఖమ్మం జిల్లా ఎండోమెంట్ శాఖ ముద్ర మాత్రమే ఉంది. పూజలు చేసిన తేదీ, వాహనదారులు చిరునామా వివరాలు కూడా నమోదు చేయలేదు. దేవాదాయశాఖ ఉద్యోగులు లేకుండా ప్రైవేట్ వ్యక్తులు నకిలీ రశీదులతో వేలాది రూపాయలను వాహనదారుల నుంచి వసూళ్లు చేశారు. వాహనాల పూజ టికెట్ల విషయంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని భక్తులు, వాహనదారులు కోరుతున్నారు.

గాంధీ జయంతి రోజూ ఆగని జంతు బలి

ఈ నెల 2న గాంధీ జయంతి. దీనికితోడు శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాల చివరి రోజు. దీంతో ఆలయం సముదాయంలో, పరిసర ప్రాంతాల్లో జంతుబలి నిషేధం అమలు చేయాలి. కానీ దసరా పండుగ అని ఆలయంలో మేకలు, గొర్రెలు, కోళ్లను యథేచ్ఛగా వధించారు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు కూడా జోరుగా సాగాయి. ఆలయ ఈఓ, ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోలేదు. జంతు బలిపై భక్తులు ఫిర్యాదు చేసినా ఈఓ స్పందించలేదని, జంతుబలిని పరోక్షంగా ప్రోత్సహించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ టికెట్ల వ్యవహారంపై పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ ఎన్.రజినీకుమారిని వివరణ కోరగా.. టికెట్ల విక్రయాల్లో అవకతవకలు జరగలేదని తెలిపారు.

క్లుప్తంగా

గాంధీజీ, శాస్త్రి సేవలు చిరస్మరణీయం



గాంధీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

మధిర: జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాంధీజీ, శాస్త్రి జయంతి సందర్భంగా మధిరలోని క్యాంపు కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ గాంధీజీ పాటించిన సత్యం, అహింస, సమానత్వం అనే విలువలు శాశ్వతమైనవని తెలిపారు. ఆయన ఆశయాలు నేటి సమాజానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. అలాగే, లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన జై జవాన్, జై కిసాన్ నినాదం రైతు, సైనికుల గౌరవాన్ని మరింతగా పెంచిందని తెలిపారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు



పద సంచలన్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

కామేపల్లి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ(ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు శుక్రవారం రాత్రి కామేపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన స్వయం సేవకులు ప్రత్యేక దుస్తుల్లో పద సంచలన్ చేశారు. అనంతరం సాయిబాబా ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో జిల్లా సంఘ్ చాలక్ లక్కినేని ప్రసాద్ మాట్లాడారు. వ్యక్తి నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని తెలిపారు. స్వయం సేవకులు దేశాభివృద్ధి, సామాజిక శ్రేయస్సుకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూరి శివరామకృష్ణ, మోహన్‌నాయక్, పోలూరి రామచంద్రయ్య, భద్రయ్య, దయానంద్, వెంకటాచారి, పూజల శివకృష్ణ, హన్మంతరావు, జర్పుల రామారావు, భూక్యా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టెట్ తీర్పుపై ప్రభుత్వం అప్పీల్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

మధిర: ఉపాధ్యాయులందరికీ టెట్ తప్పనిసరి చేస్తూ ఇచ్చిన తీర్పుపై రాష్ట్రప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ చేయాలని టీఎస్ యూటీఎఫ్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. మధిరలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సర్వీసులో కొనసాగాలన్నా, పదోన్నతి పొందాలన్నా టెట్ తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం ఇచ్చిన టెట్ నోటిఫికేషన్లలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించినందున సీనియర్ ఉపాధ్యాయులకు నష్టం జరగకుండా సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలన్నారు. అలాగే, ఎన్నికల విధుల నుంచి గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్న వారిని మినహాయించాలని సూచించారు. నాయకులు వినోద్‌రావు, బండారు నాగరాజు, వీరయ్య, ఇబ్రహీం, లాల్ అహ్మద్, రమేష్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి నివాళి



దామోదర్‌రెడ్డి కుటుంబీకులను ఓదారుస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంమయూరిసెంటర్/కామేపల్లి: మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో మృతదేహం వద్ద మంత్రి పొంగులేటి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి శుక్రవారం నివాళులర్పించి దామోదర్‌రెడ్డి కుటుంబీకులను పరామర్శించారు. అలాగే, కామేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో దామోదర్‌రెడ్డి చిత్రపటం వద్ద కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు.

అమ్మా మైసమ్మా.. మమ్మేలు తల్లీ

కోటమైసమ్మ తల్లి జాతరకు పోటెత్తిన భక్తజనం





కోటమైసమ్మ జాతర ప్రాంగణంలో భక్తజనం (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కారేపల్లి: అమ్మా మైసమ్మా.. మా తల్లీ మైసమ్మా.. మమ్మేలు తల్లీ భక్తజనం తన్మయత్వంతో ఊగిపోయారు. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన కోట మైసమ్మ తల్లి ఆలయం వద్ద ఏటా దసరాకు జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో జిల్లా నుంచే భద్రాద్రి, మహబూబాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు ప్రభబండ్లు, వాహనాలో తరలివచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో జాతర ప్రాంగణం కిక్కిరిసింది. దేవాదాయ ధర్మదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన ఈనెల 7వ తేదీ వరకు జరిగే జాతరకు ఏర్పాట్లు చేయగా భక్తులు తల్లిని దర్శించుకున్నారు. కాగా, జాతరకు వచ్చిన భక్తులకు ఆటవిడుపుగా సోలాపూర్ సర్కస్, జాయింట్ వీల్ ఏర్పాటుచేయడంతో చిన్నాపెద్ద తేడా లేకుండా రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ బి.గోపి ఆధ్వర్యాన ఇద్దరు సీఐలు, పదిమంది ఎస్ఐలు, 100మంది కానిస్టేబుళ్లతో బందోబస్తు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు రావడంతో జాతర ప్రాంగణం నుంచి సోలార్ ప్లాంట్ వరకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా పోలీసులు వాహనాలు మళ్లించారు. కోటమైసమ్మను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఇల్లెందు మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు దంపతులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ ఈఓ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

గుట్టకింది వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పట్టాభిరామారావు పర్యవేక్షిస్తున్నారు.



జాతర ప్రాంగణంలో ఆకట్టుకుంటున్న జెయింట్ వీల్



ఆలయ ఆవరణలో భక్తుల కోలాహలం

దాతృత్వం అభినందనీయం

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సత్తుపల్లి: డబ్బు చాలా మందికి ఉన్నా ప్రజల కోసం రూ.కోట్లు వెచ్చించి సేవా కార్యక్రమాలు నిర్వహించే గుణం ఉండదని.. అలాంటి గుణం కలిగిన దాసరి మధుమోహన్‌రెడ్డి సేవలు అభినందనీయమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లి మండలం గంగారంలో దాసరి మధుమోహన్‌రెడ్డి నిర్మించిన చాకలి ఐలమ్మ భవనం, యాదవ భవనం, దుర్గాదేవి ఆలయ మండపం, దుర్గమ్మతల్లి ఆర్చి, చర్చితో పాటు ఐదు తాగునీరు బోర్లు, సీసీ కెమెరాలు, యానాదుల కాలనీ చుట్టూ ప్రహరీని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయితో కలిసి మంత్రి గురువారం ప్రారంభించారు. అలాగే, రూ.కోటి వ్యయంతో వడ్డెర కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశాక మంత్రి మాట్లాడుతూ దాసరి వీరారెడ్డి పేరును చిరస్థాయిగా నిలిపేలా ఆయన మనువడు మధుమోహన్‌రెడ్డి చేసిన పనులు ఎప్పటికీ గుర్తుంటాయని తెలిపారు. కాగా, వచ్చే విజయదశమికల్లా బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు తీసుకొస్తామని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి మాట్లాడగా డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ దాసరి వెంకట్రామిరెడ్డి(చిట్టి నాయన), మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, నాయకులు మట్టా దయానంద్, శివ వేణు, దొడ్డా శ్రీనివాసరావు, కావేటి అప్పారావు, కోలగట్ల చెన్నకేశవరావు, ఊకే రమేష్, ఎండీ.కమల్‌పాషా, ఎస్.కే.మౌలాలి పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ భవనం వద్ద మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి, దాసరి మధుమోహన్‌రెడ్డి



ఆలయంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

శ్రీనాగమలేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం రేజర్లలోని శ్రీదుర్గానాగమల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే రాగమయి, టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆస్తుల రక్షణ, ప్రయాణికుల భద్రతే లక్ష్యం

ఆర్‌పీఎఫ్ డివిజనల్ కమిషనర్ నవీన్‌కుమార్

ఖమ్మంక్రైం: రైల్వే శాఖకు చెందిన ఆస్తులను రక్షించడమే కాక ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా ఆర్‌పీఎఫ్ పని చేస్తోందని సికింద్రాబాద్ డివిజనల్ కమిషనర్ ఏ.నవీన్‌కుమార్ స్పష్టం చేశారు. ఖమ్మంలోని ఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆర్‌పీఎఫ్ పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన గదులు, సిబ్బంది విశ్రాంతికి నిర్మించిన బ్యారక్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులతో పలు అంశాలపై సమీక్షించి సూచనలు చేశారు. ఆతర్వాత కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల గంజాయి, నిషేధిత మద్యాన్ని రైళ్లలో అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం ఉనంనందున విస్తృత తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. అంతేకాక రైల్వే ఆస్తులను రక్షించడానికి నిఘా తీవ్రం చేశామని చెప్పారు. ఆర్‌పీఎఫ్ సీఐ బుర్ర సురేష్‌గౌడ్, ఏఎస్ఐలు మోడిన్సా, ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



బ్యారక్‌లో పరిశీలిస్తున్న కమిషనర్ నవీన్‌కుమార్

రూ. 3కోట్లు 'హస్తార్పణం'

రహదారి నిర్మాణంలో ఇష్టారాజ్యం

అశ్వారావుపేట: అధికార పార్టీ నాయకులకు లబ్ధి చేకూరేలా డిజైన్ చేసిన ఓ బీటీ రోడ్డు నిర్మాణం మూణ్నాళ్ల ముచ్చటగానే నిలవగా స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధి పేటమాలపల్లి నుంచి వ్యవసాయ క్షేత్రాల మీదుగా బోర్డర్ చెక్ పోస్టు వరకు మూడు కి.మీ. మార్గం ఉంది. ఆయిల్‌పామ్, కొబ్బరి, ఉద్యాన పంటలతో పచ్చగా కళకళలాడే వ్యవసాయ క్షేత్రాల మధ్య సాగే ఈ రోడ్డుపై ఎక్కడ గుంతలు ఉంటాయో.. ఎక్కడ రోడ్డు కోతకు గురైందో తెలియని పరిస్థితి నెలకొంది. కొందరు కాంగ్రెస్ నాయకులు ఈ రహదారిని నిర్మించగా.. వారు లాభాలు మాత్రమే చూసుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులను వాహనాల్లో తరలించేందుకు గత పాలకులు రహదారి అవసరమని గుర్తించి ఐటీడీఏ నుంచి రూ.3కోట్లు కేటాయించారు. కానీ బినామీ కాంట్రాక్టర్ల తీరుతో రోడ్డు కొద్దికాలానికే దెబ్బతినడం.. అయినా అంతా బాగుందని సర్టిఫికెట్ ఇచ్చిన ఇంజనీర్ల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయాన్ని ఐటీడీఏ ఏఈఈ ప్రసాదరావు దృష్టికి తీసుకువెళ్లగా రహదారిని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పునర్నిర్మించే వరకు కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించేది లేదని స్పష్టం చేశారు.



బీటీ లేక మెటల్ రోడ్డును తలపిస్తున్న రహదారి



చిన్న వర్షానికే కోతకు గురైన రహదారి

హైవేకు సర్వీసు రోడ్లు ఏర్పాటుచేయించండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నుంచి ఏపీలోని దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు అవసరమైన చోట సర్వీసు రోడ్లు నిర్మించాలని, లేకపోతే రైతులు ఇబ్బందిపడతారని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు పేర్కొన్నారు. ఈమేరకు రోడ్లు నిర్మించేలా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుకు హైదరాబాద్‌లో శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ హైవేతో భూములు రెండుగా చీలినందున సర్వీసు రోడ్లు లేకపోతే పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బంది పడతారని తెలిపారు. నాయకులు బండారు నరేష్, యార్లగడ్డ రాఘవరావు పాల్గొన్నారు.



రామచంద్రరావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

9నుంచి ఐదేళ్ల లా కోర్సు సప్లిమెంటరీ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఆసిం ఇక్బాల్ అలీ తెలిపారు. ఈనెల 9న మొదటి పేపర్, 13న రెండు, 15న మూడు, 17న నాలుగో పేపర్ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఆయా తేదీల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐదో సెమిస్టర్ పరీక్షలు..

ఐదేళ్ల లా కోర్సు ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. 8న మొదటి పేపర్, 10న రెండు, 14న మూడు, 16న నాలుగు, 18న ఐదో పేపర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని అధికారులు రాజేందర్, ఆసిం ఇక్బాల్ తెలిపారు.

రూ.వెయ్యితో బతికేదెలా?

- పెన్షన్ రూ.10 వేలకు పెంచాలని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల వేడుకోలు
- అధికారులతో సమానంగా వైద్య సేవలు అందించాలని డిమాండ్



కోల్‌మైన్స్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): నెలకు రూ.1000 పెన్షన్‌తో తమ జీవితం ఎలా గడపాలని సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. కనీస పెన్షన్ రూ.10వేలకు పెంచాలని, అధికారులతో సమానంగా వైద్య సేవలు అందించాలని కోరుతున్నారు. 1998లో ప్రవేశపెట్టిన కోల్‌మైన్స్ పెన్షన్ స్కీమ్ ప్రకారం కనీస పెన్షన్ రూ.350 నిర్ణయించారు. అయితే ఈ మొత్తాన్ని పెంచాలని 27 ఏళ్లుగా కోల్ పెన్షనర్స్ అసోషియేషన్ నాయకులు ఆందోళన చేయగా రూ.1000కి పెంచారు. అయితే దీనికి డీఏ పెంపు వర్తించకపోవడంతో తాము అర్ధాకలితో అలమటిస్తున్నామని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు గాలికి..

కోల్ మైన్స్ పెన్షన్ స్కీం చట్ట ప్రకారం ప్రతీ మూడేళ్లకోసారి పింఛన్లను సవరించాలనే నిబంధన ఉంది. ఈ విషయమై పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సిఫార్సులు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, పారిశ్రామిక వినియోగదారుల ధరల సూచిక అనుసరించి కరువు భత్యం (డీఏ) అనుసంధానం చేస్తూ పెన్షన్ పెంచాలని రిటైర్డ్ ఉద్యోగులు అంటున్నారు. ప్రతీ ఐదేళ్లకు ఒకసారి జరిగే వేతన ఒప్పందంతో పాటు పెన్షన్ పెంచాలని కోరుతున్నా తమ బాధను ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

జాతీయ పెన్షన్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలి..

కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రద్దు చేసి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, కోలిండియా, సింగరేణి ఆధ్వర్యంలో జాతీయ పెన్షన్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు కోరుతున్నారు. దీంతో పాటు సోషల్ రెస్పాన్సిబిలిటీ, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, బొగ్గు యాజమాన్యం సంస్థలవార్షిక లాభాల నుంచి మూడు శాతం పెన్షన్ ఫండ్‌కు కేటాయించాలని, ఉద్యోగులకు, అధికారులకు ఒకే రకమైన వైద్య విధానం అమలు చేయాలని, హైదరారాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నెలకొల్పి అన్ని రకాల వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతి టన్నుకు రూ.20 కేటాయించాలి



సింగరేణి కార్మికుల సీఎంపీఎఫ్‌ను రద్దుచేసి, జాతీయ పెన్షన్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలి. కోలిండియా పరిధిలోని ప్రతి బొగ్గు పరిశ్రమలో ఉత్పత్తి అయ్యే బొగ్గు నుంచి వచ్చే ఆదాయంలో ప్రతీ టన్నుకు రూ.20 చొప్పున రికవరీ చేసి, సీఎంపీఎఫ్‌కు అందించాలి. ప్రతి మూడేళ్లకు డీఏ పెంచాలనే నిబంధనలు అమలు చేయాలి.

– పి.మాధవనాయక్, ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి

సమాన వైద్య సదుపాయం కల్పించాలి



సర్వీసులో ఉన్నప్పుడు కార్మికులు, అధికారులు అనే వ్యత్యాసం చూపే సింగరేణి సంస్థ ఉద్యోగ విరమణ తర్వాత కూడా అలాగే వ్యవహరిస్తోంది. ఇది సరైన విధానం కాదు. ప్రధానంగా వైద్య సేవల్లో కార్మికులకు ఒక విధంగా, అధికారులకు మరోలా సేవలు అందించటం సరికాదు. ఉద్యోగ వీరమణ పొందిన ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలి.

– జి.శ్రీనివాస్, రిటైర్డ్ ఉద్యోగి

నిరుద్యోగ బతుకమ్మ

మండలంలోని మల్లారంలో నిరుద్యోగ యువకులు బతుకమ్మ పండుగ వినూత్నంగా జరుపుకున్నారు. డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసినా ఉద్యోగాల నోటిఫికేషన్ రావడం లేదంటూ గురువారం రాత్రి నిరుద్యోగ బతుకమ్మను తయారు చేశారు. బతుకమ్మ వద్ద 'బంగారు తెలంగాణ కాదు – నిరుద్యోగ తెలంగాణ' అంటూ ప్ల కార్డులు ఏర్పాటు చేశారు. – తల్లాడ



యువకులు రూపొందించిన బతుకమ్మ

ఆర్టీసీలో స్పెషల్ బాదుడు

- తిరుగు ప్రయాణంలో జనం కష్టాలు
- అత్యధిక బస్సులు హైదరాబాద్‌కే కేటాయింపు
- గ్రామీణ ప్రాంతాల ప్రజల అవస్థ



సత్తుపల్లి బస్టాండ్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

సత్తుపల్లిటౌన్: దసరా పండుగకు స్వస్థలాలకు వచ్చిన జనం తిరుగు ప్రయాణంలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సరిపడా బస్సులు లేక బస్టాండ్లలో ప్రయాణికులు ఎదురుచూపుల్లో గడుపుతున్నారు. మరోపక్క స్పెషల్ చార్జీల భారంతో పండుగ ఆనందం ఆవిరవుతోందని పలువురు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలోని సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. ఖమ్మం నుంచి సైతం అత్యధిక సర్వీసులు రాజధానికే రాకపోకలు సాగిస్తున్నాయి. ఈక్రమాన పలు గ్రామీణ సర్వీసులను రద్దు చేయటంతో నిత్యం రాకపోకలు సాగించే జనం అవస్థ పడాల్సి వస్తోంది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని చాలా బస్టాండ్లలో శుక్రవారం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.

హైదరాబాద్ సరే.. మిగతా చోట్లకు?

ఉమ్మడి జిల్లాలోని వేలాది మంది విద్య, వ్యాపార, ఉద్యోగ, ఉపాధి తదితర అవసరాలకు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వీరంతా దసరా పండుగకు స్వస్థలాలకు వచ్చారు. పండుగ ముగియడంతో శుక్రవారం తిరుగు ప్రయాణం కాగా.. ఆర్టీసీ అధికారులు అత్యధిక బస్సులను హైదరాబాద్‌కే కేటాయించారు. ఇందులో భాగంగా సత్తుపల్లి డిపో నుంచి హైదరాబాద్ రెగ్యులర్‌గా నడిచే 25 సర్వీసులే కాక ఇతర మార్గాల్లో రాకపోకలు సాగించే బస్సులనూ అటే కేటాయించారు. ఈ కారణంగాఆర్టీసీకి ఆదాయం పెరిగినా.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు మాత్రం సమస్యలు ఎదుర్కొన్నారు. ఇది కాక మరికొన్ని మార్గాల్లో బస్సుల సంఖ్య తగ్గింది. హనుమకొండ నుంచి ఖమ్మంకు నిత్యం రాకపోకలు సాగించే ఎలక్ట్రిక్ బస్సులను సైతం హైదరాబాద్ రూట్‌లోనే కేటాయించారు. దీంతో ఖమ్మం నుంచి హనుమకొండకు వెళ్లేందుకు శుక్రవారం బస్సులు లేక.. గంటకొకటి చొప్పున వస్తున్న అరకొర బస్సుల్లో సీట్లు దక్కించుకునేందుకు పరుగులు తీయడం కనిపించింది.

స్పెషల్ బాదుడు ఇలా..

సత్తుపల్లి నుంచి ఎంజీబీఎస్‌కు సూపర్ లగ్జరీ బస్సు చార్జీ సాధారణ రోజుల్లో రూ.580 ఉండగా.. ఇప్పుడు రూ.810కి పెంచారు. అలాగే, జీడిమెట్ల చార్జీ రూ.610 నుంచి రూ.860కి, ఈసీఎల్‌కు రూ.610 నుంచి రూ.860కి, బీహెచ్ఈఎల్‌కు రూ.610 ఉండగా రూ.860, ఏసీ బస్సులో చార్జీ రూ.760ని రూ.1,070కి పెంచారు. దీంతో ఇప్పటికే పండుగ ఖర్చు భరించిన ప్రజలపై అదనం భారం మోపినట్లయింది.

లక్కీ డ్రాతో ఆకట్టుకునేలా..

ఖమ్మం రీజియన్‌లోని డిపోల నుంచి ప్రతిరోజు హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, ఏలూరు, అశ్వారావుపేట రూట్లలో ప్రయాణికుల రాకపోకలతో బస్సులు రద్దీగా ఉంటాయి. ఈ నేపథ్యాన ఆర్టీసీ అధికారులు లక్కీడ్రా స్కీం ప్రారంభించారు. సూపర్‌లగ్జరీ, డీలక్స్, లహరి, రాజధాని బస్సుల్లో ప్రయాణించే వారు టికెట్ వెనుక భాగాన పేరు, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ రాసి బస్టాండ్ ప్రాంగణంలోని డబ్బాలో వేయాలి. ఆపై రీజియన్ పరిధిలో ముగ్గురిని ఈనెల 8న లక్కీ డ్రాద్వారా విజేతలుగా ఎంపిక చేస్తామని ప్రకటించి.. విస్తృత ప్రచారం చేస్తున్నారు.



లక్కీడ్రా బాక్స్‌లో టికెట్లు వేస్తున్న దృశ్యం

రద్దీకి అనుగుణంగా బస్సులు



ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణమే సురక్షితం. ప్రయాణికుల రద్దీ ఆధారంగా హైదరాబాద్‌కు రెగ్యులర్ సర్వీస్‌లతో పాటు అదనపు బస్సులు నడిపిస్తున్నాం. ఇదే సమయాన ఇతర రూట్లలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఒకేసారి అందరూ తిరుగు ప్రయాణం కావడంతో రద్దీ పెరిగింది. ఈ విషయాన్ని గుర్తించి ప్రయాణికులు సహకరించాలి.

– వి.సునీత, డిపో మేనేజర్ సత్తుపల్లి